


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02
4PM

బంగారం ధర ₹63,230 10 GRMS 24 CARAT
వెండి ధర 1KG 76,000
సెన్సెక్స్ 72,065 ↑121
నిఫ్టి 21,908 ↑21
చికెన్ ధర 1KG ₹220
గుడ్ల ధరలు డజన్ ₹68



## ఎల్లిగడ్డ.. కిలో రూ.400

ఎల్లిగడ్డ(వెల్లుల్లి) ధర రోజురోజుకూ పెరుగుతోంది. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని వారపు అంగడిలో మంగళవారం కిలో ఎల్లిగడ్డల ధర రూ.400 పలికింది. దీంతో రేటు ఇంతగా పెరిగిందా? అని విస్తుపోతూ కిలో కొనుగోలు చేద్దామని వచ్చిన వారు పావుకిలో మాత్రమే తీసుకుంటున్నారు. రెండు నెలల నుంచి ఎల్లిగడ్డల ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెప్పారు.

## విశాల్ కొత్త రాజకీయ పార్టీ?



ప్రముఖ నటుడు విశాల్ కూడా రాజకీయ పార్టీ పెట్టనున్నట్లు సమాచారం. ఆయన మొదటి నుంచే రాజకీయాలపై ఆసక్తి చూపుతున్నారు. ఆర్కేనగర్ ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని భావించగా నామినేషన్ తిరస్కరించారు. తన అభిమాన సంఘాన్ని 'విశాల్ మక్కల్ నల ఇయక్కం'(విశాల్ ప్రజా సంక్షేమ సంఘం)గా మార్చి అన్ని జిల్లాల్లో ఇన్‌ఛార్జులను నియమించారు. బూత్ కమిటీలు కూడా ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాలకు షూటింగ్‌లకు వెళ్లినప్పుడు విశాల్ అక్కడి ప్రజల కష్టాలు, అవసరాలను అడిగి తెలుసుకుని తగిన సాయం చేస్తూ, పరిష్కరిస్తూ వస్తున్నారు. త్వరలో విశాల్ మక్కల్ నల ఇయక్కం నిర్వాహకులను చెన్నైకి పిలిపించి సమాలోచన జరపనున్నట్లు సమాచారం.

## 18న అభ్యర్థుల ప్రకటన?



రాష్ట్రంలో మిగతా రాజకీయ పార్టీల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించడం ద్వారా లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగాలని బీజేపీ నాయకత్వం యోచిస్తోంది. లోక్‌సభ ఎన్నికల కసరత్తు పూర్తిచేసి ఈ నెల 18న అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఢిల్లీలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశాలప్పుడు పార్టీ పార్లమెంటరీ బోర్డు భేటీ కానున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఈ సందర్భంగానే లోక్‌సభ అభ్యర్థులను ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అభ్యర్థుల ఎంపికలో జరిగిన ఆలస్యం లోక్‌సభ ఎన్నికలకు జరగకుండా అభ్యర్థులను ముందే ప్రకటిస్తామని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గతంలో హామీ ఇచ్చారు. ఇందుకు తగ్గట్లుగానే త్వర లో అభ్యర్థులను ఖరారు చేస్తామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఇటీవలే ప్రకటించారు. ఈ నేపథ్యంలో వివిధ సర్వేలు, ఇతర అంశాల ఆధారంగా అభ్యర్థుల ఎంపికకు కసరత్తు ఊపందుకున్నట్లు తెలుస్తోంది.



## పెరిగిన ఫోన్ పే యాప్ డౌన్‌లోడ్స్

Paytmపై RBI ఆంక్షల కారణంగా ఫోన్ పే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వారి సంఖ్య పెరిగిందని 'యాప్ ఫిగర్స్' సంస్థ వెల్లడించింది. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 మధ్య మొత్తంగా 10.4 లక్షల డౌన్‌లోడ్స్ జరిగాయని నివేదికలో పేర్కొంది. తాజా గణాంకాల ప్రకారం ప్లేస్టోర్‌లో 'ఫోన్ పే బిజినెస్' యాప్ 188వ స్థానంలో ఉండగా.. ఫిబ్రవరి 5న 33వ స్థానానికి చేరుకుంది.

## ఇన్‌స్టాలో సరికొత్త ఫీచర్



ప్రముఖ ఫోటో షేరింగ్ యాప్ ఇన్‌స్టాగ్రామ్ సరికొత్త ఫీచర్ తీసుకొచ్చింది. వాట్సాప్ మాదిరిగానే మెసేజ్‌లు పంపిన 15 నిమిషాల్లోగా వాటిని ఎడిట్ చేసుకునే ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. మెసేజ్‌లో తప్పులు దొర్లినా వాటిని అన్‌సెండింగ్ చేయకుండానే ఎడిట్ చేసుకునే సౌలభ్యం కలగనుంది. 15 నిమిషాల తరువాత ఈ సౌకర్యం అందుబాటులో ఉండదు.



## భారీగా పెరగనున్న స్మార్ట్‌ఫోన్ ధరలు

2024 జూన్ నుంచి స్మార్ట్‌ఫోన్ ధరలు భారీగా పెరిగే సూచనలున్నాయి. ప్రస్తుతం ఉన్న ధరలకంటే సుమారు 10 నుంచి 15 శాతం పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మార్కెట్ పరిశోధన సంస్థ ట్రెండ్‌ఫోర్స్ DRAM (మెమరీ చిప్స్) ధరలలో పెరుగుదల ఉందని సూచించింది. మెమొరీ చిప్‌ల ధరలు పెరగడంతో వచ్చే త్రైమాసికం నుంచి స్మార్ట్‌ఫోన్ ధరలు పెరగనున్నట్లు వెల్లడించింది.



## బీజేపీతో పొత్తు ఖరారైనట్లేనా..?

టీడీపీ అధినేత చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం ఢిల్లీ వెళ్లనున్నారు. అయితే బీజేపీతో పొత్తు ఖరారైందని టీడీపీ నేతలు చెబుతున్నారు. అమిత్ షా తో చంద్రబాబు భేటీలో సీట్ల సర్దుబాటుపైనే చర్చించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఇప్పటికే బీజేపీకి ఇవ్వాల్సిన స్థానాలపై క్లారిటీ వచ్చినట్లు తెలుస్తోంది. బీజేపీకి 5 అసెంబ్లీ, 3 పార్లమెంట్ స్థానాలు ఇచ్చే ఆలోచన టీడీపీ ఉన్నట్లు తెలుస్తోంది.



## లాభాల్లో స్టాక్ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్లలో లాభాల పరుగు కొనసాగుతోంది. అంతర్జాతీయంగా వస్తున్న సానుకూల సంకేతాలకు తోడు, దేశీయంగా దిగ్గజ షేర్లు రాణించడం వీటికి కలిసొచ్చింది. దీంతో బుధవారం నాటి ట్రేడింగ్‌ను మార్కెట్లు ఉత్సాహంగా మొదలుపెట్టాయి. ఆరంభంలో నిఫ్టీ 22వేల మార్క్ పైన కదలాడింది. ఉదయం 9.30 గంటల సమయంలో సెన్సెక్స్ 154.47 పాయింట్లు లాభపడి 72,340.56 వద్ద, నిఫ్టీ 53.75 పాయింట్ల లాభంతో 21,983.15 వద్ద కొనసాగుతున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 2 పైసలు పెరిగి 83.03 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎస్‌బీఐ, కోల్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు రాణిస్తుండగా.. భారత్ పెట్రోలియం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, విప్రో షేర్లు ఒత్తిడికి గురవుతున్నాయి.

## కలరా కల్లోలం.. 600 మంది మృతి!

ఆఫ్రికా దేశం జాంబియాను కలరా వ్యాధి కలవరపెడుతోంది. వేలాది మంది ఈ వ్యాధి బారినపడుతున్నారు. గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటివరకు 600 మంది ప్రాణాలు కోల్పోయారు. 15 వేల మందికి పైగా ఈ బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. ఆ దేశంలోని పది ప్రావిన్స్‌లలో తొమ్మిదింటిలో ఈ వ్యాధి వ్యాపించింది. ప్రభుత్వం స్టేడియాల వద్ద తాత్కాలిక చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేసింది.



# 2.86 లక్షల కోట్లతో ఏపీ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్

ఏపీ అసెంబ్లీలో 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. ఐదేళ్లుగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం తనకు దక్కిందన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ సందేశంతో బడ్జెట్ ప్రసంగాన్ని ఆయన ప్రారంభించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2,86,389 కోట్ల అంచనాతో బడ్జెట్‌ను మంత్రి ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో ఏపీని సంపన్న ఆంధ్రగా మంత్రి బుగ్గన చెప్పుకొచ్చారు.

బడ్జెట్ ముఖ్యాంశాలు...

రూ.2,30,110 కోట్ల రెవెన్యూ వ్యయం
రూ.30,530 కోట్ల మూలధన వ్యయం
రూ.24,758 కోట్ల రెవెన్యూ లోటు
రూ.55,817 కోట్ల ద్రవ్యలోటు అంచనా
రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 3.51 శాతం మేర ద్రవ్యలోటు
జీఎస్‌డీపీలో 1.56 శాతం మేర రెవెన్యూ లోటు ఉంటుందని అంచనా.

ఏపీలో వైసీపీ ప్రభుత్వం వరుసగా ఐదోసారి రాష్ట్ర అసెంబ్లీలో ఇవాళ బడ్జెట్ ను ప్రవేశపెట్టింది. ఎన్నికల ఏడాది కావడంతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ను ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రవేశపెట్టారు. మొత్తం రూ.2.86 లక్షల వ్యయ అంచనాలతో ఈ బడ్జెట్ ను రూపొందించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,30,110 41 కోట్లు కాగా... మూలధన వ్యయం రూ.30,530.18 కోట్లుగా ప్రతిపాదించారు. మరోవైపు బడ్జెట్ లో రెవిన్యూ లోటును రూ.24,758.22 కోట్లుగా చూపారు. ద్రవ్య లోటును రూ. 55,817.50 కోట్లుగా చూపారు.జీఎస్డీపీలో ద్రవ్య లోటు 3.51 శాతంగా



తెలిపారు. అలాగే రెవిన్యూ లోటు 1.56 శాతంగా తేలింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో 7 విధానాలు అనుసరించామని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. ఇందులో సుపరిపాలన, సామర్థ్య, మహిళా మహారాణులు, అన్నపూర్ణ, సంక్షేమ, సంపన్న, భూభద్ర ఆంధ్ర విధానాలతో ముందుకు నడిచామన్నారు.వచ్చే ఆర్థిక సంవత్సరంలో మొదటి నాలుగు నెలల అవసరాల కోసం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రతిపాదనల్ని ఆర్థిక మంత్రి సభ ముందుంచారు. వీటిలో వచ్చే ఏప్రిల్, మే,జూన్,జులై నెలల కోసం రూ.88,215 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు చేశారు. ఎన్నికల తర్వాత మరోసారి బడ్జెట్ భేటీ పెట్టి మిగిలిన ప్రతిపాదనల్ని ఆమోదించనున్నారు. ఆలోపు ఓటాన్ అకౌంట్ లో ఆమోదించిన మేరకు ఖర్చు చేసుకునేందుకు ప్రభుత్వానికి అవకాశం లభిస్తుంది.

ఆర్థిక మంత్రి బుగ్గన కామెంట్స్..

ఆక్వా ఉత్పత్తిని మరింత పెంచేలా 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టాం
2 వేకు పైగా ఫిష్ ఆంధ్రా రీటైల్ దుకాణాలను స్థాపించాం
తద్వారా ఏపీ దేశంలోనే ఆక్వాహబ్‌గా తయారైంది.
10,778 రైతు భరోసా కేంద్రాలు వన్ స్టాప్ సెంటర్లుగా ఏర్పాటు చేశాం
రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది
వైద్యారోగ్య రంగంలో 'నాడు నేడు' పథకం అమలు చేశాం
ఉప ఆరోగ్య కేంద్రాల నుంచి బోధనాసుపత్రుల వరకూ రూ.16,852 కోట్లు వ్యయం చేశాం
53.58 లక్షల మంది రైతులకు రూ.33,300 కోట్ల మేర రైతు భరోసా ఆర్థిక సాయం అందించాం.

## ఎవరూ ఊహించని పాత్ర నాది

"మంకీ మ్యాన్' ప్రేక్షకులకు కనువిందు చేయనుంది అంటోంది' కథానాయిక శోభిత ధూళిపాళ. దేవ్ పటేల్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న ఈ చిత్రంతో ఆమె హాలీవుడ్‌లో అడుగు పెడుతోంది. సినిమా ప్రచారంలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఆమె పంచుకున్న విశేషాలివి. 'మంకీ మ్యాన్' ఊహాతీత మలుపులతో సాగిపోయే కథ. నా పాత్ర అయితే మరీ ప్రత్యేకంగా ఉంటుంది. ప్రేక్షకులు ఇలాంటి పాత్రను ఎప్పుడూ ఊహించి ఉండరు. పోరాటాలు, సంగీతం, భావోద్వేగాలు, తెరకెక్కించిన విధానం.. అన్నీ వేటికవే ప్రత్యేకం. నటుడు, దర్శకుడు దేవ్‌పటేల్‌కి ప్రతి విభాగంపై పట్టు ఉంది. చెప్పాలంటే తనో పని రాక్షసుడు. తనకి ఓపిక, సినిమా పట్ల అంకితభావం చాలా ఎక్కువ. అది సినిమాలో ప్రతి సన్నివేశంలో కనిపిస్తుంటుంది. మకరంద్ దేశ్‌పాండే, సికందర్ ఖేర్, పితోబష్‌లు కూడా తమ పాత్రల్లో అద్భుతంగా నటించారు. అసహాయురాలైన తన తల్లిని అన్యాయంగా చంపిన కొందరు అవినీతి నాయకులపై ప్రతీకారం తీర్చుకునే ఓ వ్యక్తి కథే.. ఈ 'మంకీమ్యాన్'. తమ అధికారం కోసం పేదల్ని మాఫియా ఎలా బలిపశువుల్ని చేసిందన్నదే ఈ యాక్షన్ థ్రిల్లర్ కథాంశం.



## భారతీయ పర్యాటకులకు వీసా ఫ్రీ ఎంట్రీ ప్రకటించిన ఇరాన్..



భారతీయులకు వీసా మినహాయింపు ఇచ్చే దేశాల జాబితాలో తాజాగా ఇరాన్ వచ్చి చేరింది. భారతీయ పర్యాటకులకు వీసా ఫ్రీ ఎంట్రీని ప్రకటించింది. వీసా అవసరం లేకుండానే భారతీయులు తమ దేశానికి రావొచ్చని వెల్లడించింది. ఈ మేరకు వీసా కలిగి ఉండాలన్న నిబంధనలను ఈ నెల 4 నుంచి ఎత్తి వేస్తున్నట్లు ప్రకటించింది. సాంస్కృతిక, పర్యాటక సంబంధాల మార్పిడిని మరింత వేగవంతం చేసుకొనేందుకు ఈ నూతన విధానం అమలు చేస్తున్నట్టు తెలిపింది. అయితే కొన్ని షరతులు పెట్టింది. భారతీయ పర్యాటకులు వీసా లేకుండానే తమ దేశంలో 15 రోజుల పాటు ఉండొచ్చని తెలిపింది. విమాన మార్గంలో వచ్చే ప్రయాణికులకు మాత్రమే ఈ వీసా ఫ్రీ ఎంట్రీ వర్తిస్తుందని వెల్లడించింది. ఈ గడువు ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించబోమని స్పష్టం చేసింది. కేవలం పర్యాటకం కోసం వచ్చిన వారికి మాత్రమే వీసా ఎత్తివేత అమలవుతుందని తెలిపింది. ఆరు నెలలకోసారి మాత్రమే ఈ వీసా రహిత టూర్‌లకు అనుమతిస్తామని పేర్కొంది.



# తహశీల్దార్ రమణయ్య కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం

ఏపీలో తహశీల్దార్ రమణయ్య హత్య కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. హత్యకు గురైన ఎమ్మార్వో రమణయ్య కుటుంబానికి ఏపీ ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం ప్రకటించింది. రమణయ్య కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాగా, విశాఖ జిల్లా కొమ్మాదిలో ఎమ్మార్వో రమణయ్య దారుణ హత్యకు గురయ్యాడు. దుండగులు అర్ధరాత్రి ఆయన ఇంట్లోకి చొరబడి రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో ఎమ్మార్వో రమణయ్య మరణించాడు. ఎమ్మార్వో రమణయ్య హత్య కేసులో నిందితుడు మురారీ సుబ్రమణ్యంను విశాఖ పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఓ భూ వివాదంలో కంబైన్డ్ డీడ్ చేయడంలో రమణయ్య జాప్యం చేయడం వల్లే ఈ హత్య జరిగినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

# ఫారెస్ట్ పనుల్లో అక్రమాలు.. మాజీ మంత్రి ఇంట్లో ఈడీ సోదాలు

ఉత్తరాఖండ్ కాంగ్రెస్ నేత, ఆ రాష్ట్ర మాజీ మంత్రి హరక్ సింగ్ రావత్ ఇండ్లల్లో ఇవాళ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు చేస్తున్నది. ఉత్తరాఖండ్‌తో పాటు ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతంలో మొత్తం పది ప్రదేశాల్లో తనిఖీలు జరుగుతున్నాయి. ఫారెస్ట్ స్కామ్‌తో లింకు ఉన్న మనీ ల్యాండరింగ్ కేసులో ఈ సోదాలు జరుగుతున్నట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఢిల్లీ, డెహ్రాడూన్‌తోపాటు చండీఘడ్‌లోనూ తనిఖీలు జరుగుతున్నాయి. జిమ్ కార్బెట్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో జరిగిన అవకతవకల అంశంలో ఈడీ సోదాలు చేస్తోంది. 2022 ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు హరక్ సింగ్ రావత్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కారణంగా బీజేపీ అతన్ని క్యాబినెట్ నుంచి తొలగించింది. పార్టీ ప్రైమరీ సభ్యత్వాన్ని కూడా రద్దు చేసింది. కార్బెట్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో 2021లో జరిగిన నిర్మాణాల విషయంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. హరక్ సింగ్ రావత్ అటవీశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆ అవినీతి జరిగింది. ఈ కేసులో డీఎఫ్‌వో కిషన్ చాంద్ కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

# హెలికాప్టర్ ప్రమాదంలో చిలీ మాజీ అధ్యక్షుడు మృతి

హెలికాప్టర్ ప్రమాదంలో చిలీ మాజీ అధ్యక్షుడు సెబాస్టియన్ పినేరా (74) మృతిచెందారు. ఈ విషయాన్ని ఆయన కార్యాలయం ధ్రువీకరించింది. నలుగురు వ్యక్తులతో కలిసి హెలికాప్టర్‌లో పినేరా ప్రయాణిస్తుండగా అది కూలిపోయింది. దీంతో ఆయన మృతిచెందగా, మిగతావారు గాయాలతో బయటపడ్డారు. ఆయన మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆ దేశ ఆర్మీ ప్రకటించింది. కన్జర్వేటివ్ పార్టీకి చెందిన పినేరా మొదట 2010 నుంచి 2014 వరకు, రెండోసారి 2018 నుంచి 2023 వరకు చిలీ దేశాధ్యక్షుడిగా ఉన్నారు. బిలియనీర్ అయిన ఆయన చిలీలోని అత్యంత ధనికుల్లో ఒకరిగా ఉన్నారు. ఆయన మృతి పట్ల దక్షిణ అమెరికా దేశాధినేతలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా పలువురు నేతలు సంతాపం వ్యక్తం చేశారు.



## మరో పాదయాత్రకు సిద్ధమైన

# బండి సంజయ్




లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. తెలంగాణలో రాజకీయాలు ఉపందుకున్నాయి. ఓవైపు అధికార పార్టీ గెలుపు జోష్‌ను కంటిన్యూ చేస్తూ.. మెజార్టీ సీట్లు సాధించేందుకు ప్రణాళికలు రచిస్తుండగా.. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహాలు రచిస్తోంది. ఇక.. కేంద్రంలో ఫుల్ జోష్‌లో ఉన్న బీజేపీ పార్టీ.. తెలంగాణలోనూ కమలం హవా చూపించి.. అత్యధిక ఎంపీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలోనే.. అసెంబ్లీ ఎన్నికల్లో తన పాదయాత్రతో ఓటింగ్ శాతం పెంచిన బండి సంజయ్ మరో పాదయాత్రతో రంగంలోకి దిగుతున్నారు. అయితే.. ఈసారి రాష్ట్రం మొత్తం కాకుండా.. తన కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోనే యాత్ర కొనసాగనున్నట్టు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజా సంగ్రామ యాత్ర పేరుతో బండి సంజయ్ పాదయాత్ర చేపట్టగా.. ఇప్పుడు విజయ సంకల్ప యాత్ర పేరుతో యాత్ర చేపట్టనున్నారు. ఈ యాత్రను.. ఫిబ్రవరి 10వ తేదీ నుంచి ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు బండి సంజయ్. కాగా.. లోక్‌సభ ఎన్నికలు జరిగే వరకు ఈ యాత్ర కొనసాగించాలని బండి సంజయ్ నిర్ణయించుకున్నారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం.. మేడిపల్లి నుంచి విజయ సంకల్ప యాత్రను బండి సంజయ్ ప్రారంభించనున్నారు. కాగా.. తొలిదశలో మొత్తం 119 కిలో మీటర్లు ఈ యాత్ర కొనసాగించనున్న బండి సంజయ్.. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలో యాత్రను ముగించనున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని మండలాలతతో పాటు వీలైనన్ని ఎక్కువ గ్రామాల గుండా పాదయాత్ర కొనసాగేలా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకున్నారు. అయితే.. ఈ యాత్ర ద్వారా.. కేంద్ర అభివృద్ధి పథకాలను జనంలోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నారు బండి సంజయ్. ప్రజా సంగ్రామ యాత్రతో తెలంగాణలో బీజేపీ ముఖచిత్రమే మారిపోయిందని.. ఇప్పుడు చేపట్టనున్న విజయ సంకల్ప యాత్రతో తిరుగులేని శక్తిగా ఆవిర్భవించబోతుందని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 17 ఎంపీ సీట్లను గెలుచుకోవటమే లక్ష్యంగా పనిచేస్తుందని బండి సంజయ్ చెప్పుకొచ్చారు.

# ఫిబ్రవరి 16 నుంచి ఓటీటీలోకి 'ది కేరళ స్టోరీ'



గతేడాది విడుదలైన వివాదాస్పద చిత్రాల్లో 'ది కేరళ స్టోరీ' ఒకటి. సినీ రంగంలోనే కాకుండా రాజకీయంగానూ సంచలనం సృష్టించింది ఈ చిత్రం. 2023 మే 5న విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమా వచ్చి 8 నెలలు అయిన ఇంకా ఎప్పుడు ఓటీటీలోకి వస్తుందా ఎప్పుడెప్పుడు చూద్దామా అంటూ ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ఓటీటీ అప్‌డేట్ ఇచ్చారు.ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'జీ5' వేదికగా ఈ చిత్రం ఫిబ్రవరి 16 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఇక హిందీతో పాటు, తమిళ, తెలుగు, మలయాళ భాషల్లో ఈ సినిమా ప్రసారం కానుంది. లవ్ జిహాద్ నేపథ్యంలో రూ.35 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా ఊహించని విధంగా రూ.244.8 కోట్ల మేర రాబట్టిన విషయం తెలిసిందే. కేరళలోని బాలికలను ఇస్లాం మతంలోకి మార్చి సౌదీకి తరలించారనే నేపథ్యంలో సుదీప్తో సేన్ ఈ సినిమాను తెరకెక్కించారు. ఇందులో అదా శర్మతోపాటు యోగితా బిహానీ, సిద్ధి ఇద్నానీ, సోనియా బలానీ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు.






## 'జాక్' నాకు కొంచెం క్రాక్ అంటూ వస్తున్న

# సిద్ధు జొన్నలగడ్డ

'డీజే టిల్లు' సినిమాతో హీరోగా తన నటనతో, డైలాగ్ డెలివరీతో ఆకట్టుకున్న కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ. ఈ సినిమాతో సిద్ధుకు యూత్‌లో మాములు క్రేజ్ రాలేదు. ప్రస్తుతం ఈ సినిమాకు సీక్వెల్ తెరకెక్కుతుంది. ఇక ఇదిలా ఉంటే సిద్ధు తన తదుపరి సినిమాను బొమ్మరిల్లు భాస్కర్‌తో చేస్తున్న విషయం తెలిసిందే. SVCC 37 గా వస్తున్న ఈ సినిమా షూటింగ్ కూడా రీసెంట్‌గానే స్టార్ట్ అయ్యింది. ఇదిలావుంటే నేడు సిద్ధు జొన్నలగడ్డ పుట్టినరోజు. ఈ సందర్భంగా సినీ ప్రముఖులు సిద్ధుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే సిద్ధు పుట్టినరోజు కానుకగా SVCC 37కి సంబంధించి మేకర్స్ టైటిల్ అనౌన్స్‌మెంట్ చేశారు. ఈ మూవీకి జాక్ అనే టైటిల్ పెట్టినట్లు తెలిపారు. దీనితో పాటు పోస్టర్ కూడా విడుదల చేశారు. ఇక ఈ పోస్టర్‌లో సిద్ధు గన్స్ పట్టుకుని ఫుల్ యాక్షన్ మోడ్‌లో కనిపిస్తున్నారు. ఇక ఈ సినిమాకు హ్యారిస్ జయరాజ్ స్వరాలు సమకూర్చుతున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ తెరకెక్కిస్తున్నారు.




# పేటీఎంపై ఆర్‌బీఐ ఆంక్షలు..

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ ఆంక్షలు విధించడంతో వాటి నుంచి బయటపడేందుకు కంపెనీ మార్గాలను అన్వేషిస్తోంది. ఈ క్రమంలోనే సంస్థ సీఈవో విజయ్ శేఖర్ శర్మ కేంద్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. మంగళవారం ఆయన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైనట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కేవలం 10 నిమిషాల పాటు ఈ భేటీ జరిగినట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఈ వ్యవహారంలో కేంద్రం జోక్యం చేసుకునేది ఏమీ లేదని ఆర్థిక మంత్రి చెప్పినట్లు సమాచారం. ఆర్‌బీఐతోనే సమస్యను పరిష్కరించుకోవాలని, వారి మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని నిర్మలమ్మ సూచించినట్లు తెలుస్తోంది. మరోవైపు, రెగ్యులేటరీ ఆంక్షలపై చర్చించేందుకు ఆర్‌బీఐ అధికారులతోనూ విజయ్ శర్మ సమావేశమైనట్లు సమాచారం. పేటీఎంకు చెందిన పేమెంట్స్ బ్యాంక్‌కు ఇటీవల ఆర్‌బీఐ షాకిచ్చిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 29 తర్వాత ఏ కస్టమర్, ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్, వ్యాలెట్, ఫాస్టాగ్‌లలో డిపాజిట్లు, టాప్-అప్‌లు చేపట్టకూడదని ఆదేశించింది. సమగ్ర సిస్టమ్ ఆడిట్, బయటి ఆడిటర్ల నివేదికలను అనుసరించి ఈ చర్యలు తీసుకుంది. బ్యాంక్‌లో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించామని ఆర్‌బీఐ పేర్కొంది. అటు.. పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్)పై తాజాగా విధించిన ఆంక్షలకు సంబంధించిన నివేదికను ఇవ్వాల్సిందిగా ఆర్‌బీఐను ఈడీ, ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ)లు కోరాయి. ఈ పరిణామాలతో ఇటీవల కంపెనీ షేర్లు దారుణంగా పడిపోయాయి. మరోవైపు, పేటీఎంపై ఆంక్షలు వెనక్కి తీసుకునే అంశాన్ని పరిశీలించాలని పలు ప్రముఖ అంకుర సంస్థల వ్యవస్థాపకులు ప్రభుత్వానికి లేఖ రాశారు.

# 'స్పిరిట్' లో హీరోయిన్ గా రష్మిక?

పాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్ హీరోగా ప్రస్తుతం రెండు సినిమాలు తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. వాటిలో ఒకటి మారుతీ తీస్తున్న ది రాజా సాబ్ కాగా మరొకటి నాగ అశ్విన్ తెరకెక్కిస్తున్న కల్కి 2898 ఏడి. ఇక వీటి అనంతరం అతిత్వరలో సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో స్పిరిట్ మూవీ చేయనున్నారు ప్రభాస్. ఇందులో ఆయన ఒక హానెస్ట్ అండ్ పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నట్లు ఇటీవల పలు ఇంటర్వ్యూస్ లో భాగంగా దర్శకుడు సందీప్ మాట్లాడుతూ చెప్పారు. విషయం ఏమిటంటే, గ్రాండ్ లెవెల్లో భారీ హంగులతో రూపొందనున్న ఈ మూవీలో హీరోయిన్ గా నేషనల్ క్రష్ రష్మిక మందన్న నటించనున్నట్లు లేటెస్ట్ టాలీవుడ్ క్రేజీ బజ్. ఇటీవల రణబీర్ కపూర్ తో సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించిన ఆనిమల్ లో రష్మిక హీరోయిన్ గా నటించి తన అందం, అభినయంతో అందరినీ మెప్పించిన విషయం తెలిసిందే. రష్మిక వర్క్ తనకు ఎంతో నచ్చడంతో మరొక్కసారి స్పిరిట్ లో కూడా ఆమెనే హీరోయిన్ గా తీసుకోవాలని సందీప్ ఫిక్స్ అయ్యారట. అయితే ప్రస్తుతం ప్రచారం అవుతున్న ఈ న్యూస్ పై ఆ మూవీ మేకర్స్ నుండి అఫీషియల్ గా క్లారిటీ మాత్రం రావాల్సి ఉంది.